RNI NO: TELTEL2023/46567

# అక్షర వేదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల పక్షం

AKSHARA VEDAM TELUGU DAILY

Published at Karimnagar circulated in : Telangana | సంపుటి : 04 | సంచిక : 75 | ఎడిటర్ :పొన్నం ప్రసాద్ గౌడ్ | బుధవారం 18-02-2026 | పేజీలు -6 | వెల: రూ. 05.00

విలేకరులు కావలెను

తెలంగాణ ప్రాంతం అన్ని జిల్లాల నుండి స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు అర్జెంటుగా కావలెను అనుభవం ఉన్నా లేకున్నా తీసుకోబడును

చీఫ్ ఎడిటర్ -పందిళ్ల రవీందర్ (9030653934)

ఎడిటర్ -పొన్నం ప్రసాద్ గౌడ్

9666992524

## శానిటేషన్ బాగా లేకుంటే

# సస్పెండ్ చేస్తా

**రోడ్లు శుభ్రం లేకపోతే అధికారులపై చర్యలు**

- క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించాలి
- ఫీల్డ్‌కు వెళ్లని అధికారులను తొలగిస్తాం
- నెక్లెస్ రోడ్డులో మల్టీలెవల్ కారు పార్కింగ్
- కొత్త మేయర్లు, మున్సిపల్ చైర్మన్లకు ఒకరోజు శిక్షణ
- మున్సిపల్ శాఖపై సమీక్షలో సీఎం రేవంత్ వెల్లడి



హైదరాబాద్, ఫిబ్రవరి 17 అక్షర వేదం

రోడ్లు శుభ్రంగా లేకపోతే అక్కడికక్కడే అధికారులపై చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ఉదయం నుంచే ఫీల్డ్‌లో ఉండాలని, రోజూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.పురపాలక శాఖపై మంగళవారం కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, కమిషనర్లు, సిబ్బందిపై సీఎం సీరియస్ అయ్యారు. త్వరలోనే ప్రతి జోన్‌లో వ్యక్తిగతంగా పర్యటించి పరిస్థితులను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. చాలా మంది అధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లడం లేదని, -మిగతా 2 లో



## అమెరికా భద్రతకు భంగం


# కలిగిస్తే ఊరుకోం

- రూల్స్ అతిక్రమిస్తే సహించేది లేదు
- ఎలాంటి వీసాలనైనా వెంటనే రద్దు చేస్తాం
- విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో

వాషింగ్టన్,

అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో విదేశీయులకు మరో వార్నింగ్ ఇచ్చారు. అమెరికా జాతీయ భద్రతకు వ్యతిరేకంగా వ్యవహరించే విదేశీయుల వీసాలను రద్దు చేసి వారిని వెనక్కు పంపించేస్తామని స్పష్టం చేశారు. అమెరికా ఈసా హక్కు కాదని గుర్తుంచుకోవాలన్నారు. అమెరికాకు వచ్చిన విదేశీ టూరిస్టులు, జర్నలిస్టులు, విద్యార్థులు అందరికీ ఈ హెచ్చరిక వర్తిస్తుందని అన్నారు. అమెరికా జారీ చేసే వీసాకు పలు పరిమితులు ఉంటాయని మంత్రి మార్కో రూబియో చెప్పారు. విదేశీ పర్యాటకులు వీటికి లోబడే ఉండాలని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని గతంలో పలుమార్లు చెప్పినా జనాలకు ఎందుకు బోధపడటం లేదో తనకు అర్థం కావటం లేదని కామెంట్ చేశారు. అమెరికా వీసాను తమ హక్కుగా విదేశీయులు భావించొద్దని అన్నారు. అది కేవలం ఒక అనుమతి మాత్రమేనని చెప్పారు.

-మిగతా 2 లో




## క్యూర్ పరిధిలో

# ఇందిరమ్మ ఇండ్లు

- మార్చి చివరి నాటికి లబ్దిదారుల ఎంపిక
- అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం
- యుద్ధప్రాతిపదికన ద్వారా లబ్దిదారుల ఎంపిక
- ఆర్,ఆర్, ఆర్, ఓ ఆర్ ఆర్ మధ్య అఫర్డబుల్ హౌసింగ్ పాలసీ
- నెలాఖరులోగా ఇండ్ల స్థలాలు కలిగిన 28వేల మందికి ఇందిరమ్మ ఇండ్లు
- హౌసింగ్ పాలసీపై అధికారులతో మంత్రుల సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 17 అక్షర వేదం

హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమి)పరిధి లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించి వచ్చే మార్చి చివరినాటికి లబ్దిదారుల ఎంపిక పక్రియను పూర్తి చేస్తామని ప్రకటించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల సేకరణ, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి, పూర్తయిన ఇండ్ల కేటాయింపు తదితర అంశాలపై మంగళవారం నాడు -మిగతా 2 లో



## పెళ్లికి ముందే శారీరక

# సంబంధాలు సరికాదు

- వ్యక్తి గురించి తెలుసుకోకుండా మోసపోతే ఎలా
- శారీరక సంబంధాల విషయంలో యువత అత్యంత అప్రమత్తంగా ఉండాలి
- కేసు విచారణ సందర్భంగా సుప్రీం హితోక్తులు

న్యూఢిల్లీ,

నేటి కాలంలో సోషల్ మీడియా, మ్యాట్రిమోనీ సైట్ల ద్వారా పరిచయాలు పెరిగి మోసపోతున్న ఘటనలు ఎక్కువవుతున్న నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. వివాహానికి ముందు ఏర్పరచుకునే శారీరక సంబంధాల విషయంలో యువత అత్యంత అప్రమత్తంగా ఉండాలని సుప్రీంకోర్టు సూచించింది. ఒక వ్యక్తి గురించి పూర్తిగా తెలియకుండా లైంగిక సంబంధంలోకి వెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించిన ధర్మాసనం, పెళ్లికి ముందు ఎవరినీ సులభంగా నమ్మకూడదని స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలు చేయడానికి కారణమైన కేసు వివరాల్లోకి వెళితే.. 2022లో ఒక మ్యాట్రిమోనీ సైట్ ద్వారా ఒక యువతికి ఓ యువకుడు పరిచయమయ్యాడు. తాను పెళ్లి చేసుకుంటానని ఆమెను నమ్మించి,

-మిగతా 2 లో

# 19న ఢిల్లీకి సీఎం రేవంత్ బృందం

- కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీకి పిలుపు
- కేబినేట్‌లో మార్పులు, చేర్పులుపై ఊహాగానాలు



హైదరాబాద్,ఫిబ్రవరి 17 అక్షర వేదం

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ బృందం ఈ నెల 19న ఢిల్లీకి వెళ్లనుంది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మారుతున్న రాజకీయ సమీకరణలు, పార్టీ బలోపేతం , భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు ఏఐసీసీ అగ్ర నాయకత్వం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రివర్గంలోని -మిగతా 2 లో

## ఘనంగా కేసీఆర్

# జన్మదిన వేడుకలు

**తెలంగాణ భవన్‌లో 72 కిలోల కేక్ కట్ చేసిన పార్టీ నేతలు**

- తెలంగాణ ఉద్యమ నేపథ్య పాటలు, డాక్యుమెంటరీ విడుదల
- కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారన్న మాజీమంత్రి తలసాని
- ముమ్మాటికీ కేసీఆర్ మాత్రమే తెలంగాణ జాతిపిత అన్న కేటీఆర్

హైదరాబాద్,ఫిబ్రవరి 17 అక్షర వేదం

బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు మంగళవారం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ , యువ నాయకులు తలసాని సాయి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అతిథులుగా హాజరయ్యారు. కేసీఆర్ 72 వ జన్మదినాన్ని పురస్కరించుకుని 72 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, తెలంగాణ ఉద్యమం నేపథ్యంతో -మిగతా 2 లో





## కఠిన షరతులతో

# ఐబొమ్మ రవికి బెయిల్

- ఇంటర్నెట్ వాడడానికి నిషేధం
- కోర్టుక పాస్ పోర్టు సరెండర్
- విదేశాలకు వెళ్లడానికి వీల్లేదు
- భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి చర్యలకు పాల్పడకుండా కోర్టు పలు ఆంక్షలు




హైదరాబాద్,

టాలీవుడ్‌తో పాటు ఇతర చిత్ర పరిశ్రమలను వణికించిన పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' వ్యవస్థాపకుడు రవికి న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఈ బెయిల్ సాధారణంగా కాకుండా అత్యంత కఠినమైన నిబంధనలతో కూడి ఉండటం గమనార్హం. గత కొంతకాలంగా సాగుతున్న విచారణ అనంతరం, ఆయనకు ఉపశమనం కలిగిస్తూ బెయిల్ మంజూరు చేస్తూ, భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి చర్యలకు పాల్పడకుండా కోర్టు పలు ఆంక్షలు విధించింది.ప్రధానంగా రవి ఇంటర్నెట్ వినియోగంపై కోర్టు పూర్తిస్థాయిలో ఆంక్షలు విధించింది. ఆయన ఎలాంటి ఇంటర్నెట్ సౌకర్యాన్ని సొంతంగా వాడకూడదని, ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో వాడాల్సి వస్తే కేవలం పోలీసుల ముందస్తు అనుమతితో మాత్రమే వినియోగించాలని స్పష్టం చేసింది. దీనితో పాటు నిందితుడు దేశం విడిచి వెళ్లకుండా కట్టడి చేస్తూ, -మిగతా 2 లో

## అస్సోంలో కాంగ్రెస్‌కు

# బిగ్ షాక్

- మాజీ అధ్యక్షుడు భూపెన్ బోరా రాజీనామా
- బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం



గౌహతి, ఫిబ్రవరి 17 అక్షర వేదం

అస్సాం ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. అస్సాం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు భూపెన్ బోరా రాజీనామా రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఈ పరిణామం తర్వాత అస్సాం సీఎం, బీజేపీ నేత హిమంత బిశ్వ శర్మ, బోరాను వ్యక్తిగతంగా కలువనున్నట్లు ప్రకటించారు. బోరా రాజీనామాపై హిమంత మాట్లాడుతూ.. -మిగతా 2 లో

## పాకిస్తాన్‌కు మరో

# షాకివ్వనున్న భారత్..

**వేసవిలో రావి నది నుంచి నీళ్లు బంద్**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 అక్షర వేదం

సింధు నదీ జలాల ఒప్పందంతో తీవ్ర నీటి సంక్షోభంలో ఉన్న పాకిస్తాన్‌కు ఇప్పుడు ఇండియా ఇంకో షాకివ్వబోతుంది. రావి నది నుంచి నీటి ప్రవాహాన్ని పూర్తిగా ఆపేయనుంది. ఈ అంశాన్ని జమ్మూ కాశ్మీర్ మంత్రి జావేద్ అహ్మద్ రానా సోమవారం వెల్లడించారు. పాకిస్తాన్‌తో ఇండియాకు సింధు నదీ జలాల ఒప్పందం ఉండేది. దీని ప్రకారం భారత సరిహద్దు, జమ్మూ కాశ్మీర్ ప్రాంతాల్లోని నీటిలో పాకిస్తాన్‌కు -మిగతా 2 లో


# బంగ్లా సార్వభౌమాధికారంలో వేలుపెట్టనీయం

- ఇతర దేశాల ఆదేశాలు ఇక్కడ పనిచేయవు
- భారత్ లక్ష్యంగా విమర్శలు చేసిన యూనస్

ఢాకా,

బంగ్లాదేశ్‌లో రాడికల్ శక్తులకు సహాయం చేయడం, మైనారిటీ హిందువులను రక్షించడంలో విఫలమయ్యారని విమర్శలు ఎదుర్కొంటున్న బంగ్లా తాత్కాలిక పాలకుడు మహ్మద్ యూనస్ దిగిపోతూ భారత్‌పై తన అక్కసును వెళ్లగక్కారు. భారతదేశ సార్వభౌమాధికారాన్ని ధిక్కరిస్తూ, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. 2024లో హసీనా తన పదవికి రాజీనామా చేసి, భారత్ పారిపోయి వచ్చిన తర్వాత యూనస్ అధికారం చేపట్టి బంగ్లాలో భారత వ్యతిరేకతను పెంచి పోషించాడు. తాజాగా ఆయన చేసిన ప్రసంగంలో భారత్‌పై తన వ్యతిరేకతను వెల్లడించారు. విదేశాంగ విధానంలో బంగ్లాదేశ్ సార్వభౌమాధికారం, గౌరవం, స్వాతంత్ర్యాన్ని తిరిగి పొందిందని,

-మిగతా 2 లో



## అమెరికా భద్రతకు భంగం కలిగిస్తే ఊరుకోం

(మొదటి తరువాయి)

వీసాలు పొందిన వారికి ప్రత్యేక చట్టపరమైన హక్కులు ఏవీ ఉండవని చెప్పారు. వీసా కచ్చితంగా ఇవ్వాలన్న రాజ్యాంగ నిబంధన ఏదీ లేదని అన్నారు. 'టూరిస్టుగా, స్టూడెంట్‌గా, జర్నలిస్టుగా ఈ దేశంలోకి వచ్చిన వారు అమెరికా జాతీయ భద్రతకు విఘాతం కలిగించే పనులు చేశారంటే మీ వీసాలను తీసేసుకుంటాం' అని హెచ్చరించారు. వలసల నిరోధానికి అమెరికా ఇప్పటికే పలు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. గత నెలలో ఏకంగా 75 దేశాల వారికి ఇమిగ్రెంట్ వీసాల జారీని నిలిపివేసింది. ఈ దేశాల వారు అమెరికా ప్రభుత్వ ఖజానాకు భారంగా మారుతున్నారని తెలిపింది.ద

## పెళ్లికి ముందే శారీరక సంబంధాలు సరికాదు

(మొదటి తరువాయి)



పలుమార్లు శారీరక సంబంధం పెట్టుకున్నాడు. అయితే, సదరు యువకుడికి అప్పటికే రెండు పెళ్లిళ్లు అయ్యాయని బాధితురాలికి ఆలస్యంగా తెలిసింది. దీనిపై ఆమె నిలదీయగా, తమకు సంబంధించిన ప్రైవేట్ వీడియోలను బయటపెడతానని అతడు బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు అతనిపై అత్యాచారం కేసు నమోదు చేశారు.

ఈ కేసులో నిందితుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఘాటుగా స్పందించింది. ఒకరి గురించి పూర్తి సమాచారం లేకుండా అంతటి సాన్నిహిత్యం ఏర్పరచుకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించింది. పెళ్లి పేరుతో జరిగే ఇలాంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోర్టు ఈ సందర్భంగా గుర్తు చేసింది.

## 19న ఢిల్లీకి సీఎం రేవంత్ బృందం

(మొదటి తరువాయి)

పలువురు కీలక మంత్రులు ఈ పర్యటనలో పాల్గొనబోతున్నారు. వీరితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా ఈ సమావేశంలో భాగస్వామి కానున్నారు. 19వ తేదీ ఉదయం ఢిల్లీకి చేరుకోనున్న వీరు, కాంగ్రెస్ అగ్ర నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ , కేసీ వేణుగోపాల్‌తో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. రాష్ట్రంలో పాలన మొదలై రెండేళ్లు దాటిన క్రమంలో, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిపై నివేదిక ఇవ్వనున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఈ భేటీ తర్వాత తెలంగాణ క్యాబినెట్‌లో మార్పులు లేదా చేర్పులు ఉండొచ్చనే ఊహాగానాలు కూడా రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ఖాళీల భర్తీతో పాటు పలువురి మంత్రి పదవుల్లో మార్పులు చేర్పులు చోటుచేసుకునే వీలుందని అంటున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలవుతున్న సంక్షేమ పథకాలు, ముఖ్యంగా గ్యారెంటీల అమలు తీరుపై అధిష్టానం సమీక్షించనుంది. అలాగే ఇటీవల వరుస ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాలపైనా కాంగ్రెస్ అగ్రనాయకత్వం సంతృప్తితో ఉంది. ప్రభుత్వ పనితీరుతో పాటు పార్టీ నిర్మాణం, సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయడం , పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీపై అధిష్టానం దిశానిర్దేశర చేయనుంది. అలాగే విపక్షాల విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టడం , భవిష్యత్తు ఎన్నికల వ్యూహాల గురించి రాహుల్ గాంధీ స్వయంగా నాయకులకు సూచనలు చేసే అవకాశం ఉంది. కాంగ్రెస్ అధిష్టానం ప్రస్తుతం వివిధ రాష్ట్రాల నాయకులతో వరుస సమావేశాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగానే 19వ తేదీ ఉదయం తెలంగాణ నేతలతో సమావేశమై, అదే రోజు సాయంత్రం మహారాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంతో భేటీ కానుంది. రాష్ట్రంలో పార్టీ స్థితిగతులను మెరుగుపరచడంతో పాటు, ప్రభుత్వం , పార్టీ మధ్య సమన్వయాన్ని పెంచడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.

### కఠిన షరతులతో
## ఐబొమ్మ రవికి బెయిల్

(మొదటి తరువాయి)

ముందస్తు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లకూడదని ఆదేశించింది. భద్రతా చర్యల్లో భాగంగా రవి తన పాస్‌పోర్ట్‌ను వెంటనే కోర్టులో డిపాజిట్ చేయాలని న్యాయస్థానం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.కొత్త సినిమాలు విడుదలైన గంటల్లోనే వాటిని తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తూ చిత్ర పరిశ్రమకు కోట్లాది రూపాయల నష్టాన్ని చేకూర్చారనే ఆరోపణలపై రవి అరెస్ట్ అయ్యారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉన్నందున, ఆయన మళ్లీ వెబ్‌సైట్ నిర్వహణ లేదా పైరసీ పనులు చేపట్టకుండా ఉండేందుకే కోర్టు ఇంటర్నెట్‌పై ఇటువంటి అరుదైన , కఠినమైన ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది.

## బంగ్లా సార్వభౌమాధికారంలో వేలుపెట్టనీయం

(మొదటి తరువాయి)

ఇకపై ఇతర దేశాల ఆదేశాలపై పనిచేయదని చెప్పారు. భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటూ ఈ వ్యాఖ్యలు చేశాడు. భూటాన్, నేపాల్, 'సెవెన్ సిస్టర్స్'తో బంగ్లాదేశ్ అపారమైన ఆర్థిక సామర్థ్యాన్ని కలిగి ఉందని చెప్పారు. భారతదేశంలోని అంతర్భాగమైన 7 ఈశాన్య రాష్ట్రాలను ఉద్దేశించి యూనస్ ఈ వ్యాఖ్యలు చేశారు. తన హయాంలో చైనా, జపాన్, యూఎస్ఏ, యూరప్‌తో బంగ్లా సంబంధాలను పెంచానని, భారతదేశ వ్యూహాత్మక 'సిలిగురి కారిడార్'కు సమీపంలోని తీస్తా నదిపై చైనా సహాయంతో ప్రాజెక్టులు కడుతున్నామని చెప్పారు. ఇదే కాకుండా బంగ్లాదేశ్ సైన్యాన్ని విదేశాల దురాక్రమణను ఎదుర్కోవడానికి బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. ఇది భారత్‌ను ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యగా పరిగణిస్తున్నారు. తాజాగా జరిగిన బంగ్లాదేశ్ ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ) సంచలన విజయం సాధించింది. ఆ పార్టీ అధ్యక్షుడు తారిఖ్ రెహ్మాన్, బంగ్లాదేశ్ ప్రధానిగా 17న ప్రమాణస్వీకారం చేశారు. అయితే, దిగిపోతూ కూడా యూనస్ తన భారత వ్యతిరేకతను దాచుకోలేదు. పరోక్షంగా భారత్‌తో బంగ్లా సంబంధాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారు.

## శానిటేషన్ బాగా లేకుంటే సస్పెండ్ చేస్తా

(మొదటి తరువాయి)

అలాంటి వారిని సస్పెండ్ చేస్తానని ముఖ్యమంత్రి వార్నింగ్ ఇచ్చారు. హైదరాబాద్‌తో పాటు మూడు కార్పొరేషన్లలో శానిటేషన్, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు పైన అధ్యయనం చేయాలన్నారు. ట్రాఫిక్ బాగా ఉన్న చోట పీపీపీ విధానంలో స్కై వాక్ బ్రిడ్జిల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో మల్టీలెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అడ్వటైజింగ్ బోర్డుల ఏర్పాటుపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడకుండా చర్యలు ఉండాలని సీఎం తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల కోసం 10



శాతం అడ్వటైజింగ్ బోర్డులు కేటాయించాలని ముఖ్యమంత్రి చెప్పారు. అడ్వటైజింగ్ బోర్డుల నుంచి సంవత్సరానికి ఒకసారి ఫీజు వసూలు చేయాలని అధికారులకు సూచించారు. అనధికార అడ్వటైజింగ్ బోర్డులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో వీధి దీపాల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీధి దీపాల నిర్వహణ విషయంలో యూనికోడ్ ఉండాలన్నారు. జంక్షన్ల వద్ద స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. జీహెచ్ఎంసీ విభజన విషయంలో తలెత్తిన పలు సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు చేశారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు

(మొదటి తరువాయి)

సచివాలయంలోని తన కార్యాలయంలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ తో కలిసి సమీక్షించారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి విపి గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు పాల్గొన్నారు. పట్టణాల్లోని మురికివాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడు తున్నారని ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో ఇండ్లు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని హైదరాబాద్‌కు దూరంగా గతంలో 42వేల ఇండ్లను నిర్మించగా అందులో సగం మంది మాత్రమే అక్కడ నివసిస్తున్నారని ఇటీవల నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో తేలిందని సమావేశంలో అధికారులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే చాలాచోట్ల బోగస్ లబ్ధిదారులు కూడా ఉన్నారని అధికారులు మంత్రులకు వివరించారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా ,నిరుపేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా, వారి నివాస ప్రాంతాలకు దగ్గరగా స్థానిక పరిస్థితులను బట్టి ఐదు నుంచి 10 అంతస్థుల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలనే ఆలోచన చే?స్తున్నామని ,వచ్చే క్యాబినెట్ సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముగ్గురు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, నాలుగు జిల్లాల కలెక్టర్లు సమన్వయంతో వారి వారి ప్రాంతాలలో స్థలాలను గుర్తించి ఎన్ని ఇండ్లు నిర్మించవచ్చు, ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారు వంటి వివరాలతో పదిరోజుల్లో నివేదిక అందజేయాలని ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మురికివాడల్లో స్థలం ఉన్నవారు అంగీకరిస్తే ఆ ప్రాంతంలో జీప్లస్ 5 వరకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి అభివృద్ధి చేయాలన్న ఆలోచన చేస్తున్నామని జేఎన్ఎన్‌యూ ఆర్ ఎం పథకంలో నిర్మించిన ఇండ్లు శిథిలావస్థకు చేరాయని వాటి స్థానంలో కూడా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే ఆలోచన చేస్తున్నామన్నారు. మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఇండ్ల స్థలాలు ఉన్న 28వేల మంది లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న, ఇప్పటికే పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మార్చి చివరినాటికి లబ్దిదారులను ఎంపిక చేయాలని ఆయా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్లకు లబ్దిదారులను గుర్తించి ఆ లబ్దిదారులే ఆ ఇండ్లను పూర్తి చేసుకోవడానికి అంతకుముందు ఖర్చుచేసిన మొత్తాన్ని పరిగణనలోకి తీసుకొని మిగిలిన నిధులను హౌసింగ్ కార్పొరేషన్ నిధులను మంజూరు చేస్తుందని తెలిపారు.

## ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

(మొదటి తరువాయి)

రూపొందించిన పాటలు, డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తన ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప వ్యక్తి గా కేసీఆర్‌చరిత్రలో నిలిచిపోతారని అన్నారు.పదేళ్ల పాలనలో దేశం అబ్బురపడే విధంగా అనేక పథకాలు అమలు చేసిన ఘనత కేసీఆర్ దక్కుతుందని పేర్కొన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అధికారంలో ఉన్నామని దౌర్జన్యాలు చేస్తామంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలకు గతంలో ఏ ముఖ్యమంత్రి ప్రచారం చేయలేదని, కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రచారం నిర్వహించిన, దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడిన చెప్పుకోదగ్గ ఫలితాలు కాంగ్రెస్ పార్టీ సాధించలేదని విమర్శించారు. మూడేళ్ల తర్వాత వచ్చేది తమ ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, సుధీర్ రెడ్డి, తెలంగాణ భవన్ ఇంచార్జి రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యమ కారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏ జాతి నీది? ఏ ఉన్నా. తెలంగాణలో రెండే జాతులు ఉన్నాయి. ఒకటి తెలంగాణ వాదుల జాతి, రెండవది తెలంగాణ ద్రోహుల జాతి. మాది ఫైటర్ల జాతి, మీది ట్రెయిటర్ల (ద్రోహుల) జాతి. మాది కేసీఆర్ లాంటి ఫైటర్ల జాతి, నీది మరి ట్రెయిటర్ల జాతిగుర్తుపెట్టుకో.. కేసీఆర్ ఎన్నడూ చెప్పుకోలేదు నేను జాతిపితనని. ప్రజలు పిలుచుకున్నారు. ఎవరైతే స్వాతంత్ర్యం తెచ్చిండో తమ జాతికి, ఆయనను జాతిపితగా ప్రజలు పిలుచుకుంటున్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. పెద్దమనిషి, మా తెలంగాణకు బాపు లాంటి పెద్దమనిషి కాబట్టే ఇవాళ మేము గర్వంగా చెప్పుకుంటాం సర్వసాధారణంగా ఏ తండ్రి అయినా ఆ కొడుకుకు, ఆ పిల్లలకు హీరోగా ఉంటారు. కానీ నా తండ్రి ఇవాళ తెలంగాణకు హీరో, అది తెలంగాణ జాతికి మొత్తానికి హీరో. ఇది వాస్తవం. కొంతమంది మాట్లాడుతున్నారు ఆనవాళ్లు చెరిపేస్తామని. కేసీఆర్ జన్మదిన సందర్భంగా నేను చెప్తా ఉన్నా తెలంగాణనే కేసీఆర్ ఆనవాళ్లు కదా..! తెలంగాణ రాష్ట్రమే కేసీఆర్ ఆనవాళ్లు కదా..! దాన్ని ఎట్లా చెరిపేస్తావురా సన్నాసి..? నువ్వు మమ్మల్ని ఎన్ని తిట్టినా, ఎన్ని బూతులు మాట్లాడినా ఒకటి మాత్రం వాస్తవం.. ఆయన ఒక శిఖరం, నువ్వు ఒక శునకం. నీ స్థాయి గదే, నీ బతుకు గదే. అందుకే నీకంటే ఇవాళ తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు తెలుసునన్నారు.

## పాకిస్తాన్‌కు మరో షాకివ్వనున్న భారత్..

(మొదటి తరువాయి)

వాటా ఉంది. మన దగ్గర మిగులు జలాల్ని పాకిస్తాన్‌కు విడుదల చేయాల్సి వచ్చేది.అలాగే మన దేశంలో ఆయా నదులపై ప్రాజెక్టులు కట్టడానికి వీల్లేదు. కానీ, గత ఏడాది పహల్గాం దాడి నేపథ్యంలో పాకిస్తాన్‌తో ఈ ఒప్పందాన్ని ఇండియా రద్దు చేసుకుంది. అంటే ఇండియా నుంచి పాకిస్తాన్‌కు ప్రవహించే నదీ నీటిని ఇండియా ఆపేయొచ్చు. అలాగే ఇక్కడ నిర్మాణాలకు పాక్ అనుమతి అవసరం లేదు. ఈ నేపథ్యంలో ఇన్నాళ్లూ పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల్ని పూర్తి చేయాలని ఇండియా భావిస్తోంది. ఇప్పటికే హైడ్రో పవర్ ప్రాజెక్టు, ఇతర బ్యారేజీల నిర్మాణానికి రంగం సిద్ధం చేస్తోంది. ఇదే సమయంలో ఇప్పుడు రావి నదిపై షాపూర్ కండి బ్యారేజీను నిర్మిస్తోంది. దీని నిర్మాణం ముగింపు దశకు చేరుకుంది. మార్చి 31 నుంచి ఇది అందుబాటులోకి వస్తుంది. దీని ద్వారా రావి నదిపై నీటిని మనం నిల్వచేసుకోవచ్చు. ఇక పాకిస్తాన్‌కు ఈ నది నుంచి నీటి విడుదల ఉండదు. గతంలో ఇక్కడ బ్యారేజీ లేకపోవడం వల్ల నీటిని వృథాగా పాకిస్తాన్‌కు వదలాల్సి వచ్చేది. కానీ, ఇకపై పూర్తిస్థాయి నీటిని నిల్వ చేసుకుని ఇండియానే వాడుకుంటుంది. నిల్వ సామర్థ్యానికి మించి నీళ్లొస్తే అప్పుడు పాకిస్తాన్‌కు వదిలే ఛాన్స్ ఉండొచ్చు. ఈ నిర్ణయం ద్వారా జమ్మూ కాశ్మీర్ ప్రాంతానికి మేలు జరుగుతుంది. వేసవిలో నీటి ఇబ్బందులు తీరుతాయి. ముఖ్యంగా ఎక్కువ కరువు ఎదుర్కొంటున్న కథ్వా, సాంబా జిల్లాలకు మేలు జరుగుతుంది. ఇక ఈ నిర్ణయం ద్వారా పాకిస్తాన్ ఇబ్బంది పడుతుంది కదా' అన్న ప్రశ్నకు జమ్మూ కాశ్మీర్ మంత్రి జావేద్ సమాధానమిచ్చారు. 'వాళ్లు ఇబ్బంది పడితే మనకెందుకు సమస్య అని, ఇది వాళ్లు సృష్టించుకున్న పరిస్థితే కదా' అని ఆయన వ్యాఖ్యానించారు.

## అసోంలో కాంగ్రెస్‌కు బిగ్ షాక్

(మొదటి తరువాయి)

భూపెన్ బోరా అస్సాం కాంగ్రెస్ లో అట్టడుగు స్థానం నుంచి ఎదిగిన ప్రముఖ హిందూ నేత. ఆయన ఆహ్వానం మేరకు ఈ సాయంత్రం ఆయనను కలవనున్నాను. బీజేపీలో ఆయన చేరితే అస్సాం, దేశ సేవలో మరింత బలం చేకూరుతుందని అన్నారు. అస్సాం కాంగ్రెస్ చీఫ్‌గా గౌరవ్ గొగోయ్ బాధ్యతలు తీసుకునే ముందు 2021-25 వరకు అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడిగా బోరా పనిచేశారు. ప్రస్తుతం, అస్సాం కాంగ్రెస్‌లో గొగోయ్ ఆధిపత్య ధోరణి కారణంగానే బోరా రాజీనామా చేశారనే వార్తలు వినిపిస్తున్నాయి. బోరా తన రాజీనామా లేఖను కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పంపారు. 32 ఏళ్లగా పార్టీ కోసం పనిచేస్తున్నా, ఇప్పుడు విస్మరించారని, తనకు తగిన గౌరవం కల్పించలేదని ఆయన ఆరోపించారు. బోరా రాజీనామా ద్వారా కాంగ్రెస్‌లో సాధారణ వ్యక్తి అభివృద్ధి చెందలేదనే సందేశాన్ని పంపించిందని, బోరాను బీజేపీలోకి స్వాగతిస్తున్నామని, బీజేపీలో చేరాలని నిర్ణయించుకుంటే ఆయనకు సురక్షిత స్థానం నుంచి ఎన్నికయ్యేలా చేస్తామని హిమంత చెప్పారు. సీఎం హిమంత తనను కలుస్తాననే వ్యాఖ్యలపై బోరా స్పందిస్తూ.. ఏ ముఖ్యమంత్రి అయినా తన ఇంటికి వస్తే అది తనకు గర్వకారణం అని బోరా అన్నారు. ఇదిలా ఉంటే, రాజీనామాపై పునరాలోచన చేయాలని గొగోయ్, ఎంపీ ప్రద్యుత్ బోర్దోలోయ్, దేబబ్రత సైకియాతో పాటు పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు కోరారు.

# మెయిన్స్ లో సత్తా చాటిన విజన్ జూనియర్ కాలేజీ విద్యార్థులు

**- విజన్ కాలేజీ క్రమశిక్షణతో కూడిన నిరంతర సాధన అంకితభావం వల్లే సాధ్యమైంది డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి.**



**అక్షర వేదం/ మేడ్చల్ మల్కాజ్గిరి/ మేడిపల్లి: ఫిబ్రవరి 17,**
జేఈఈ మెయిన్స్ 2026 (సెషన్-1)లో విజన్ జూనియర్ కళాశాల (ఉప్పల్ డిపో) విద్యార్థులు జాతీయ స్థాయి విజయాన్ని సాధించారు. దేశవ్యాప్తంగా జరిగిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో, కళాశాల విద్యార్థులు ఎ. కౌశిక్ వర్ధన్ (99.132ం), ఎస్. సౌమ్య శ్రీ (89.29%ం) ఇతర విద్యార్థులు (87.01%ం) అద్భుతమైన పనితీరును ప్రదర్శించి జాతీయ స్థాయిలో అర్హత సాధించారు. ఎన్ఐటిలు, ట్రిబుల్ ఐటీలు మరియు అగ్రశ్రేణి బ్రాంచ్‌లలో సీట్లు పొందడం వారు ఐఐటీ ఎంట్రన్స్ జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు కూడా అద్భుతంగా అర్హత సాధించారు. ఈ విజయానికి కళాశాల యాజమాన్యం పుష్పగుచ్ఛాలతో విద్యార్థులను అభినందించింది. కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, బోధనా సిబ్బంది, తల్లిదండ్రులు మరియు స్నేహితులు సంతోషం వ్యక్తం చేశారు. క్రమశిక్షణతో కూడిన తయారీ, నిరంతర సాధన, గురువుల మార్గదర్శకత్వం మరియు తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే ఈ అద్భుతమైన ఫలితం సాధ్యమైందని వారు వెల్లడించారు. భవిష్యత్తులో ఐఐటీలలో సీట్లు సాధించి దేశానికి సేవ చేయడమే వారి లక్ష్యం. కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ భావన రిషి మాట్లాడుతూ, "ఈ ఫలితాలు మా విద్యార్థుల క్రమశిక్షణ, నిరంతర సాధన, పట్టుదల మరియు వారి లక్ష్యాలను సాధించడంలో చూపిన అంకితభావానికి ప్రతీక. ఈ విజయానికి కృషి చేసిన మా బోధనా బృందానికి ఎల్లప్పుడూ మాకు మద్దతు ఇచ్చిన తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలే మా లక్ష్యం అన్నారు. కళాశాల బోధనా సిబ్బంది కృషి, ప్రిన్సిపాల్ రమాకాంత్, వైస్ ప్రిన్సిపాల్ సుమతి మద్దతుతో విద్యార్థులు అంకితభావంతో విజయం సాధించారని డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

# ఖనిలో ఘనంగా కెసిఆర్ జన్మదిన వేడుకలు..

- -రైతుబంధుతో దేశానికి దారి చూపిన రైతు బాంధవుడు కెసిఆర్
- -తెలంగాణ ఆత్మగౌరవానికి చిరునామా కల్వకుంట్ల చంద్రశేఖరుడు..
- -స్వాభిమానాన్ని శ్వాసగా మార్చిన ఉద్యమ నేత తెలంగాణ స్వరాష్ట్రాన్ని సాధించి భవిష్యత్తుకు బాటలు వేసిన మహానేత కేసిఆర్.
- -ప్రజల గుండెల్లో నిలిచిన ఆత్మీయ మహా నాయకుడు కేసిఆర్ బాపు: వ్యాల్ల హరీష్ రెడ్డి..







**అక్షరవేదం/గోదావరిఖని: ఫిబ్రవరి17**
పేద ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న మహా నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మ దినాన్ని పురస్కరించుకొని రామగుండం నియోజకవర్గం గోదావరిఖని ప్రధాన చౌరస్తా లో మంగళవారం బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, విహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వ్యాల్ల హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, పేదలకు పండ్లు పంపిణీ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాల్ల హరీష్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ స్వరాష్ట్ర సంకల్పమే దీక్షగా స్వాభిమానాన్ని శ్వాసగా మార్చిన ఉద్యమ మహానేత, స్వరాష్ట్ర సాధకుడు, పేదల భవిష్యత్తుకు బాటలు వేసిన కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవడం ఆనందదాయకం అన్నారు. పేదల పక్షపాతిగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి వ్యవసాయం దండగ అన్న వారి కళ్లు తెరిపించి రైతుబంధు పేరుతో దేశానికే దశాదిశా చూపిన మహా నాయకుడు కేసీఆర్ అన్నారు. రైతుల కన్నీళ్లు తుడిచి రైతు బాంధవుడిగా ఇప్పటికీ రైతుల గుండెల్లో కొలువైన ఉద్యమ నాయకుడు కెసిఆర్ కొరకు ప్రజానికం ఎదురుచూస్తుంది అన్నారు. స్వరాష్ట్ర సంకల్పమే ధ్యేయంగా ఉద్యమాన్ని రచించి తెలంగాణ సాధించి ప్రజల గుండెల్లో తెలంగాణ 'బాపు'గా చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. రామగుండం నియోజకవర్గం పేద ప్రజల పక్షాన కెసిఆర్ బాపుకు వ్యాల్ల హరీష్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి జాహీద్ పాషా, మాజీ కో ఆప్షన్ తస్లీమ్ భాను, మాజీ కార్పొరేటర్లు బొబ్బిలి సతీష్, ఐత శివకుమార్, బక్కి కిషన్, బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగ అధికార ప్రతినిధి బూరుగు వంశీకృష్ణ, కొండా సురేష్, పోయిల రవి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మేకల రామస్వామి, మెరుగు చంద్రమౌళి, చొప్పరి శ్రీనివాస్, పోలాడి శ్రీనివాసరావు, పర్స స్వాతి, కడమల్ల శ్రీహరి, నడిపెల్లి సాయి, శ్రవణ్, బొట్ల పోషం, కృష్ణస్వామి, రోడ్డ సంపత్, రంగు దుర్గ ప్రసాద్, సిగిరి రాము, సురేందర్, యాదగిరి, మామిడాల రాము, రుద్రారపులక్ష్మి, రాజమ్మ, సుమతి, అనిల్, యుగేందర్, శ్యామ్, కందుగుల రాజు, చత్రియ కమలాస్, సాయి, శివానందం తదితరులు పాల్గొన్నారు.

# ఔట్ డోర్ మీడియాపై సీఎం నిర్ణయం హర్షణీయం

**-తెలంగాణ ఔట్ డోర్ మీడియా యజమానుల సంఘం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (అక్షర వేదం) :**
రాష్ట్రంలో ఔట్ డోర్ మీడియా హోర్డింగ్ లకు సంబంధించి చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో ఔట్ డోర్ మీడియాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూల వైఖరిని కనబరచడం, జీవో నంబర్ 68 ను పునరాలోచించాలని ముఖ్యమంత్రి నిర్ణయాన్ని తెలంగాణ ఔట్ డోర్ మీడియా యజమానుల సంఘం స్వాగతించింది. ఔట్ డోర్ ప్రకటనల పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన వేలాది కుటుంబాలకు తీవ్ర ఆందోళన కలిగించే అంశంగా జీవో నంబర్ 68 ఉందని తెలిపింది. ఈ నిర్ణయం సమతుల్య అభివృద్ధి, న్యాయమైన నియంత్రణ, అనుబంధ రంగాలలో ఉపాధి రక్షణకు ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని పేర్కొంది. సంక్షేమ పథకాలు, ప్రజారోగ్య ప్రచారాలు, అభివృద్ధి కార్యక్రమాలు, అత్యవసర ప్రకటనల గురించి అవగాహన కల్పించడం నుండి, రాష్ట్ర వ్యాప్తంగా తమ హోర్డింగ్ ప్రకటనల ప్రచారాల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సందేశాలను సమర్థవంతంగా వ్యాప్తి చేయడంలో తమ పరిశ్రమ నిరంతరం మద్దతును అందించిందని తెలిపింది. అదే సమయంలో పెండింగ్ లో ఉన్న ప్రకటన పన్నులు, బకాయిల వసూలు కోసం ఒక నిర్మాణాత్మక యంత్రాంగాన్ని సులభతరం చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. పారదర్శకమైన చట్టన్ని ఏర్పాటు చేస్తే, చట్టబద్ధమైన బకాయిలను క్లియర్ చేయడంలో తమ సభ్యులు ప్రభుత్వంతో పూర్తిగా సహకరించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపింది.

# 19న భూపతి చంద్ర స్మారక కథానికల పోటి-26 పురస్కారాల ప్రధానోత్సవ సభ

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (అక్షర వేదం) :**
భూపతి చంద్ర స్మారక కథానికల పోటీ-2026 పురస్కారాల ప్రదానోత్సవ సభ ఈనెల 19న సాయంత్రం ఆబిడ్స్ తెలంగాణ సారస్వత పరిషత్తు దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో సి.ఎస్?.రాంబాబు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షులు ఎమ్?.ఎల్?.కాంతారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలో ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.8 వేలు, తృతీయ బహుమతిగా రూ.6 వేలు నగదు బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులుగా అయిదుగురు రచయితలకు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలి తెలుగు కన్వీనర్ ప్రొ.సి.మృణాళిని, విశిష్ట అతిథిగా సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్, గౌరవ అతిథిగా మహమ్మద్ ఖదీర్ బాబు, ఆత్మీయ అతిథిగా ప్రముఖ రచయిత బి.నర్సింగ రావు, సినీ దర్శకులు, సాంస్కృతిక ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

# నాగ్‌పూర్‌లో 350 పడకల అత్యాధునిక కేర్ హాస్పిటల్

**-మహారాష్ట్ర సీఎం, కేంద్ర మంత్రి సమక్షంలో ఒప్పంద పత్రాల మార్పిడి**



**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (అక్షర వేదం) :**
దేశంలోని ప్రముఖ ఆరోగ్య సేవల సంస్థలలో ఒకటైన క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ నాగ్‌పూర్‌లో 350కి పైగా పడకలతో అత్యాధునిక మల్టీ-స్పెషాలిటీ కేర్ హాస్పిటల్ నిర్మాణానికి లెటర్ ఆఫ్ అక్సెప్టెన్స్ పొందిందని క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నా మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర, మధ్య భారత దేశంలో నాణ్యమైన వైద్య సేవలను విస్తరించడంలో ఇది కీలక ముందడుగుగా నిలుస్తోందని అన్నారు. ఈ లెటర్ ఆఫ్ అక్సెప్టెన్స్ ను మహా మెట్రో, క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ మధ్య, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, కేర్ హాస్పిటల్స్ సీఈఓ డాక్టర్ పవన్ కుమార్ సమక్షంలో మార్పిడి చేసుకున్నట్లు తెలిపారు. నాగ్‌పూర్‌లోని కస్తూర్చంద్ పార్క్ మెట్రో స్టేషన్ సమీపంలోని మహా-మెట్రో భూమిపై ఈ హాస్పిటల్ నిర్మించనున్నట్లు చెప్పారు. సుమారు రూ.600 కోట్ల పెట్టుబడితో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక సదుపాయాలతో ఈ వైద్య సంస్థను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

# విద్యార్థులు'జాతీయ సేవాభావం' అలవర్చుకోవాలి






**అక్షర వేదం రాయికల్ ఫిబ్రవరి 17,**
రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామ జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు జగిత్యాల రామకృష్ణ డిగ్రీ పీజీ కళాశాల ఆధ్వర్యంలో 'జాతీయ సేవాపథక' ఎన్.ఎస్.ఎస్ ప్రత్యేక శిబిరము ప్రారంభించారు. ఈ శిబిరానికి గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యా ర్థులలో జాతీయ సేవాభావం, బాల్యంలోనే సేవాతత్వం విద్యార్థులకు అవసరమని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సదాశివ్ మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులని, విద్యార్థులలో అంకితభావం సేవ దృక్పథం ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఇక నాయకులు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తమ గ్రామాన్ని ఎంచుకొని సేవ చేయడం చాలా ఆనందకరమని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. రామకృష్ణ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాఠశాల ఆవరణ క్రీడామైదానమును శుభ్రపరచారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు వాలంటీర్లు శ్రమదానంతో కూడిన సేవా పనులను అలవర్చుకొని ఎన్ఎస్ఎస్ ద్వారా సేవలను అందించాలని కోఆర్డినేటర్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో రామకృష్ణ కళాశాల ఎన్ఎస్ఎస్ పి.ఓ.ఎండి అప్సర్,జే.రాకేష్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సాయి చందు, గ్రామనాయకులుమాజీ ఎంపీపీ గంగారెడ్డి,మరిపెల్లి శ్రీనివాస్,వార్డ్ మెంబర్ రాజు కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు,పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్ కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన ఖేడ్ మున్సిపల్ చైర్మన్



**నారాయణఖేడ్,ఫిబ్రవరి 17 (అక్షర వేదం) :** ఖేడ్ మున్సిపల్ చైర్మన్ గా నూతనంగా ఎన్నికైన నగేష్ కుమార్ శెట్కార్ మంగళవారం నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఎన్.ఉమా హారతిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మున్సిపల్ అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు కే.శ్రీనివాస్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాహిర్ అలీ,కౌన్సిలర్ వివేకానంద,నాయకులు నందు శేరికార్,కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ జన్మదినం సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ



**నారాయణఖేడ్,ఫిబ్రవరి 17 (అక్షర వేదం) :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావ్ జన్మదినం సందర్భంగా కల్హేర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మాజీ జెడ్పిటిసి నరసింహారెడ్డి,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రామ్ సింగ్ లు రోగులకు పండ్లు పంపిణి చేశారు.ఈ సందర్బంగా వారు సందర్భంగా మాట్లాడుతూ.. మాజీ మంత్రి టి.హరీష్ రావ్ సహకారంతో మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్ రెడ్డి నాయకత్వంలో ఖేడ్ అన్ని రంగాలలో అభివృద్ధి చెందింది అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యులు అలీ,వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి,నాయకులు నారాయణరావు పాటిల్,జనార్ధన్,ఇంద్రనగర్ సర్పంచ్ సంగయ్య, మాజీ సర్పంచులు బాలయ్య,రాములు నాయక్, కృష్ణాపూర్ ప్యాక్స్ వైస్ చైర్మన్ రామ్ రెడ్డి, మాజీ కోప్షన్ భ్యులు గని,పెండ రాములు,మొగులయ్య, పండరి, విట్టల్, రాములు నాయక్,ఆసుపత్రి వైద్యులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హిజ్రాలకు కౌన్సిలింగ్ నిర్వహించిన ఎస్సై




**నారాయణఖేడ్,ఫిబ్రవరి 17 (అక్షర వేదం) :** ఖేడ్ పట్టణ శివారులలో వాహనాలను ఆపి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న హిజ్రాలకు మంగళవారం నారాయణఖేడ్ ఎస్సై రావుల శ్రీశైలం కౌన్సిలింగ్ నిర్వహించారు. షాపులు,శుభ కార్యాలకు వెళ్ళినప్పుడు నిర్వాహకులు సంతోషంగా ఆర్థిక సహాయం చేస్తేనే తీసుకోవాలన్నారు.అదేవిధంగా ప్రధాన రహదారులపై వాహనాలను ఆపి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నట్లు పిర్యాదులు వచ్చాయని మరొక్కసారి ఇలాంటివి జరిగితే కేసులు నమోదు చేస్తానని ఆయన వారికి హెచ్చరించారు.

## మున్సిపల్ చైర్మన్ ను మర్యాద పూర్వకంగా కలిసిన ఉద్యోగులు



**నారాయణఖేడ్,ఫిబ్రవరి 17 (అక్షర వేదం) :** ఖేడ్ మున్సిపల్ నూతన చైర్మన్ నగేష్ కుమార్ శెట్కార్ మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులు,సిబ్బంది మంగళవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చి శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు శ్రీనివాస్,తాహెర్, సాయులు పటేల్, కార్యాలయం ఉద్యోగులు,సిబ్బంది ఉన్నారు.

# డబ్ల్యూడబ్ల్యూఈయూటీ యూనియన్ లో చేరికలు





**-ఆహ్వానించిన యూనియన్ అధ్యక్షులు రాంబాబు యాదవ్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (అక్షర వేదం) :** వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ(డబ్ల్యూడబ్ల్యూఈయూటీ-2873) యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మయ్య అసోసియేట్ అధ్యక్షులు జి.లక్ష్మి నారాయణ, మేడ్చల్ శ్రీనివాస్, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ జమీల్ అహ్మద్, కార్యవర్గ సభ్యుల సమక్షంలో సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకులు దేవేందర్, వారితో పాటు ఓ అండ్ ఎం డివిజన్-5 తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సత్యనారాయణ, సుబ్బయ్య, నర్సింగ్ రావు, ఖాజా షాబుద్దీన్, ఎం.సురేందర్, ఎన్.రమేష్, సెల్వరాజ్, బాబురావు, అశోక్ కుమార్ మంగళవారం డబ్ల్యూడబ్ల్యూఈయూటీ యూనియన్ లో చేరినట్లు యూనియన్ అధ్యక్షులు రాంబాబు యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల భవిష్యత్తు అంధకారంలో వెళ్లకూడదు అంటే బిఆర్ టీయూ అనుబంధ సంఘం వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ బలపరచాలాని కోరినట్లు తెలిపారు. అవినీతికి అలావాటుపడ్డ తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులాను తరిమి కోట్టాలాని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఏ ప్రభుత్వ శాఖలో లేనివిధంగా హెచ్ ఎండబ్ల్యూఎస్ఎస్ బిలో ఫ్రీగా హెల్త్ కార్డ్స్ ఇచ్చిన ఘనత వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ కే చందుతుందని అన్నారు. ఎండబ్ల్యూఎస్ఎస్ బి ఉద్యోగులందరు కలిసి రావసిన బెనిఫిట్స్ కొరకు ఉద్యమించి మన హక్కులను సాధించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కారిక్రమానికి యూనియన్, వర్కింగ్ ప్రెసిడెంట్స్ రాంచంద్రం రెడ్డి, జి.వెంకటేష్ యాదవ్, బి.జ్ఞానేశ్వర్ కొకపేట జంగయ్య, గోపాల కృష్ణ, నిరంజన్, శ్రీనివాస్ రెడ్డి, ట్రెజరర్ రాజకుమార్ యాదవ్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ శివ రెడ్డి, వి.బాబు, ఆహ్వాక్, యూనియన్ నాయకులు కొమురయ్య, అంజయ్య, శ్రీరాములు యాదవ్, నర్సింహా రాజేష్ ముదిరాజ్, మల్లేష్, జగన్ నర్సింగ్ రావు, విశ్వనాధ్, కిషన్, షాబీర్, ప్రేమ కుమార్, వినయ్ పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ గౌతమ బుద్ధుని ఆశయ సాధనకు కృషి చేయాలి





**- ప్రముఖ బాలీవుడ్ నటుడు గగన్ మాలిక్**

**శేరిలింగంపల్లి ఫిబ్రవరి 17,(అక్షర వేదం) :** బౌద్ధమతంలో నైతిక జీవనానికి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాల్సిన ఐదు ప్రాథమిక సూత్రాలు హింస, దొంగతనం,అబద్ధాలు,కామ వికారం, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ శాంతియుత సమానత్వంతో కూడిన జీవనం సాగించాలని ప్రముఖ బాలీవుడ్ నటుడు బుద్ధిష్ట్ గగన్ మాలిక్ తెలిపారు. బుద్ధ దమ్మయాత్ర మూడవ సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా కర్ణాటక నుండి హైదరాబాద్ బుద్ధ భవన్ వరకు 80 మంది బుద్ధిష్టులు,బుద్ధ బిక్షులు 450 కిలోమీటర్ల పాదయాత్రను తొమ్మిది నెంబర్ జాతీయ రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. 450 కిలోమీటర్లు ఈ పాదయాత్రలో భాగంగా బుద్ధిష్టులు హైదర్ నగర్ గ్రామానికి చేరుకోవడంతో హైదర్ నగర్ అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వారికి ఘనంగా పూలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బుద్ధిష్టులు ప్రముఖ బాలీవుడ్ నటుడు గగన్ మాలిక్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బుద్ధిష్టులు, గగన్ మాలిక్ లు మాట్లాడుతూ బుద్ధుని యొక్క సూక్తులను బుద్ధుని యొక్క ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు.ఈ కార్యక్రమంలో హైదర్ నగర్ డాక్టర్.అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు టిడిపి, సాద మహేష్, గౌరవ సభ్యులు ఐడిపిఎల్ నరసింహ, సాద బాలయ్య,సాద కృష్ణ,సాద రమేష్,సాద చిన్న మహేష్, సాద దానయ్య,సాద రాజు, సాద విజయ్, సాద ఆంజనేయులు, సాద వెంకటేష్,యేసు తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ పుట్టినరోజు సందర్భంగా 11వ వార్డులో చీరల పంపిణీ



**నారాయణఖేడ్,ఫిబ్రవరి 17 (అక్షర వేదం) :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పుట్టినరోజు సందర్భంగా నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని 11వ వార్డులో ఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి ఆదేశానుసారం వార్డులోని మహిళలకు కౌన్సిలర్ గా పోటీ చేసిన బాదల్గామ వర్ష నగేష్ చీరలను పంపిణి చేశారు.ముందుగా అందరి సమక్షంలో కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకుని అనంతరం చీరలను పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు అభిషేక్ శెట్కార్,ర్యాకల గోపాల్,అంబదాస్, నారాయణ తదితరులు ఉన్నారు.

## కస్తూర్బ సిబ్బంది వేతనాలు పెంచాలి




**నారాయణఖేడ్,ఫిబ్రవరి 17 (అక్షర వేదం) :** గత 19 సంవత్సరాల నుండి కస్తూరి భా గాంధీ గురుకులాలో పని చేస్తున్నా సిబ్బందికి ప్రభుత్వం వేతనాలు పెంచాలని రాజ రా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎన్. సంతోష్ కుమార్ అన్నారు.మంగళవారం ఆయన ఈరోజు కస్తూరి భా గాంధీ గురుకులానికి ఉద్యోగులు,సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు.19 ఏళ్లుగా పనిచేస్తున్న 10వేల వేతనాలు మాత్రమే ఇస్తున్నారని, ఉదయం నుండి రాత్రి వరకు పనిచేస్తున్న పనికి తగిన వేతనాలు రావడం లేవని సిబ్బంది తమ గోడును సంతోష్ తో వెళ్ళబోసుకున్నారు. సంఘం ఆధ్వర్యంలో సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి మా సంఘం తరపున పై సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారితో తెలిపినట్లు ఆయన వివరించారు.వారితో పాటు సిబ్బంది కలావతి,లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## అమావాస్య సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం






**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి17 (అక్షర వేదం) :** అమావాస్య సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో వనస్థలిపురం సమీపంలోని పల్లవి గార్డెన్ వద్ద అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుమారు 600 మంది నిరుపేదలు, భక్తులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని కడుపునిండా భోజనం చేశారు. ఈ కార్యక్రమం కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్ నాయకత్వంలో జరిగింది. కార్యదర్శి సచిన్ అగర్వాల్, జాయింట్ సెక్రటరీ మనోజ్ గుప్తా, కోశాధికారి కుష్ అగర్వాల్ సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ.సి సభ్యులు సిద్దార్థ్ పాల్చం, సునీల్ దారాడే, సురేష్ ధవాలే, పక్కా, సతీష్ పిట్టల, రవి, నౌకత్ మురళి, విజయ్ గోయల్ మరియు సంజయ్ ధన్నావత్ పాల్గొని సేవలు అందించారు. అదేవిధంగా, మనోజ్ భాయ్ గౌరిశెట్టి మరియు పి. నరసింహారావు కార్యక్రమానికి హాజరై తమ విలువైన సమయాన్ని కేటాయించి సేవా కార్యక్రమానికి సహకరించినందుకు సమితి సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, సమాజ సేవే లక్ష్యంగా ఇలాంటి అన్నప్రసాద కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమం చివర్లో "జై శ్రీ కృష్ణ" నినాదాలతో సేవా కార్యక్రమం ముగిసింది.

## అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పదని




**చంపాపేట్,ఫిబ్రవరి17 (అక్షర వేదం) :** శ్రీశ్రీశ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్నప్రసాద వితరణ కమిటీ చైర్మన్ దండేటి కార్ భగవత్ జి(భగవాన్) ఆధ్వర్యంలో గత 34 మాసాలుగా అమావాస్య రోజు అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. చంపాపేట్ నల్లపోచమ్మ ఎర్ర పోచమ్మ దేవాలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాని నిర్వహించారు. సుమారు 500 మందికి అన్న ప్రసాద వితరణ చేపట్టినట్లు తెలిపారు సహకరించిన దాతలు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవిముదిరాజ్, సుశీల్ కుమార్, సంతోష్ లడ్డ, గణసాల వెంకటేష్ ( చింటూ), ఆడేళ్ల రాజా, అండేకార్ వెంకటేష్, టింగ్లికార్ రాజేష్, కంటేకర్ తిలక్ రాజ్, కంటేకర్ విట్టల్, జమాల్ పూర్ శివ.షానవాజ్ హుస్సేనీ, కర్నాటి మనోహర్, ఆడేళ్ల సంపత్, ఇట్టికల సాయికుమార్,ఆనగళ్ల జగదీష్, శ్రీను నాయక్, ఎడ్ల శివరామ్ రెడ్డి, రాదేకుమార్,గుర్రం పావని, ఎస్ సంజీవ్ కుమార్, తిప్పిరెడ్డి స్వాతి, డి సుభాష్, డి సతీష్, డి సందీప్, డి సూర్యన్స్, ఆకుల దీప, గుంజి వెంకట కోటేశ్వరరావు,రేండ్ల సారయ్య, వై లక్ష్మీ నరసయ్య, మనోజ్, భవాని, సాత్తిరిమహేష్ , ఉపేందర్ చారి, కేకే సూర్య తేజ, ఎం దీపక్, మాడ కుట్నెస్, గాజుల నవీన్ కుమార్ , నల్ల దేవేందర్ , సాయి సాగర్ , విజయ్ కుమార్, కే రాము, ఎస్ సాయికుమార్, ప్రశాంత్ యాదవ్, గూడ శ్రీనివాస్, అభిలాష్, జి సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య



**నిడమనూరు, ఫిబ్రవరి17 (అక్షర వేదం)** నిడమనూరు మండల కేంద్రానికి చెందిన పసుపులేటి కొండల్ హాలియా కేంద్రంలో బిర్యానీ హోటల్ నిర్వహిస్తూ బిజినెస్ సరిగా నడవక పోవడంతో తెచ్చిన అప్పులకి వడ్డీలు పెరిగి అప్పులు తీరకపోవడంతో మనస్థాపానికి గురై మంగళవారం తెల్లవారు జామున సుమారు ఐదు గంటల సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కొండల్ తమ్ముడు శ్రీనివాస్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు కొండలు మృతదేహాన్ని పోస్టుమార్టానికి మిర్యాలగూడ ఏరియా హాస్పిటల్ కి తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు బిడ్డలు ఉన్నారు. మృతుడి భార్య పిర్యాదు మేరకు దర్యాప్తు చేసునట్టు ఎస్సై ఉప్పు సురేష్ తెలిపారు.

# కారణజన్ముడు కేసీఆర్.. పిడిగిం నాగయ్య ముదిరాజ్

**తిరుమలగిరి సాగర్‌లో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు**
**బీఆర్ఎస్ నాయకుల కేక్ కట్, నివాళులు**



**తిరుమలగిరి సాగర్, ఫిబ్రవరి17 (అక్షర వేదం) :** తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సాధకుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు పిడిగం నాగయ్య ముదిరాజ్ మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధ్యమా అనే అనుమానాలు నెలకొన్న సమయంలో ఉక్కు సంకల్పంతో కేసీఆర్ ఉద్యమాన్ని నడిపి తెలంగాణను సాధించారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దేందుకు కేసీఆర్ చేసిన కృషి అపారమని, ఉద్యమాల తెలంగాణను పదేళ్లలోనే అభివృద్ధి పథంలో నడిపి దేశానికే ఆదర్శంగా నిలిపారని అన్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన నాయకుడు కేసీఆర్ అని, ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యల్లాపురం సర్పంచ్ రావులపాటి రాజు, మండల సీనియర్ నాయకులు నాగేండ్ల వెంకటరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పోతుగంటి తిరుమల్, మండల రైతు విభాగం అధ్యక్షులు పగడాల పెద్దిరాజు, మండల యువజన అధ్యక్షుడు జటావత్ రమేష్, బీసీ సెల్ అధ్యక్షులు మేకపోతుల కార్తీక్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు ఇస్లావత్ సిత్యా నాయక్, నాయకులు మునగాల జానకి రాములు, నల్లబోతు శంకర్, దుబ్బ కోటేష్, వీరబోయిన మల్లికార్జున్, లింగాల మొగులయ్య, మాజీ సర్పంచులు ఇస్లావత్ చందు నాయక్, కంసాని పురుషోత్తం, వడీత్య పాండు నాయక్, ఎర్ర చెరువు తండా ఉపసర్పంచ్ రమావత్ రవి నాయక్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జటావత్ చందర్, కోమల బుచ్చిబాబు, రాచమల్ల ఆంజనేయులు, నేలపట్ల సైదులు, పాతనబోయిన వనమాలు, ఇరిగి రవి, ముక్కమాల బొబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



# శివాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న




**జడ్చర్లఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**
**బండలాగుడు పోటీల మొదటి విజేతకు**
**రూ.1,10,116 నగదు బహుమతి అందజేత**

**మిడ్జిల్, ఫిబ్రవరి 17, (అక్షర వేదం) :** మిడ్జిల్ మండలంలోని వేముల గ్రామంలో ఘనంగా నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ శివాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామస్తులు ఏర్పాటు చేసిన రైతు సంబరాల్లో భాగంగా నిర్వహించిన బండలాగుడు పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పోటీలను ప్రారంభించి రైతులను, యువతను ఉత్సాహపరిచారు. రైతుల కష్టానికి గౌరవం ఇవ్వడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామీణ క్రీడలు, సంప్రదాయాలు మన సంస్కృతికి ప్రతీకలని, వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రైతు పోటీలలో మొదటి బహుమతిగా రూ. 1,10,116/- నగదును ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



# పేద కుటుంబానికి 'యలమందల' ఆపన్నహస్తం

**నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, 25కిలోల బియ్యం, 2వేలు నగదు**
**పేదలకు యలమందల జగదీష్ సేవలు ఆదర్శప్రాయం**



**ఖమ్మం, ఫిబ్రవరి 17 (అక్షర వేదం) :** ఆపదలో ఉన్న ఓ పేద కుటుంబానికి నెలకు సరిపడా నిత్యవసర సరుకులు, బియ్యం, ఆర్థిక సాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్న మంచి మనసున్న నాయకులు, నాయి బ్రాహ్మణ నగర అధ్యక్షులు, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్. ఖమ్మం అర్బన్ మండలం, కైకొండాయిగూడెం, 1వ డివిజన్ కు చెందిన ఆంగోత్ భద్రు అంధుడు. అతనికి ప్రమాదం జరిగి కాలు ఇంపెక్షన్ తో నడవలేని పరిస్థితిలో కుటుంబ భారంతో ఉన్నాడు. అతనికి ఇద్దరు ఆడపిల్లలు. కుటుంబం గడవడమే కష్టంగా ఉంది. భద్రు కుటుంబ పరిస్థితిని గమనించిన నాయి బ్రాహ్మణ నగర అధ్యక్షులు యలమందల జగదీష్ మానవత్వంతో మంగళవారం ఆ కుటుంబానికి తక్షణ సహాయంగా నెలకు సరిపోయే నిత్యావసర వస్తువులు, 25కిలోల బియ్యంతో పాటు 2వేల రూపాయల నగదు ఇవ్వడం జరిగింది. పేద కుటుంబాన్ని ఆదుకున్న విషయం గ్రామమంతా చర్చని అంశంగా మారింది. మానవత్వం ఇంకా బ్రతికే ఉంది. మంచి మనసులు మన మధ్యనే ఉన్నారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. కనీసం బంధువులు కూడా ఇటువంటి సహాయాన్ని అందించరని బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. పేద కుటుంబానికి సాయం అందించిన యలమందల జగదీష్ కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ నగర అధ్యక్షులు, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్, లాంబాడీ హక్కుల పోరాట సమితి భద్రు నాయక్, నూర్ భాషా జిల్లా ప్రధాన కార్యదర్శి మీరా, నూర్ భాషా అధికార ప్రతినిధి అన్వర్ పాషా, ఆంగోతు కిషోర్, తేజావత్ రాంకోటి, వీరస్వామి, పుల్లయ్య, శ్రీనివాస్, ఉబ్బనపల్లి రాము, తేజావత్ రమేష్, మహిళలు, గ్రామస్తులు, ప్రజలు పాల్గొన్నారు.




# సేయాన్‌తో వస్తున్న శివకార్తికేయన్

కోలీవుడ్ సెన్సేషనల్ స్టార్ శివకార్తికేయన్ తన 26వ సినిమా అప్‌డేట్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. గతేడాది 'అమరన్' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న శివకార్తికేయన్–కమల్ హాసన్ కాంబో, ఇప్పుడు 'సేయోన్' అనే పవర్‌ఫుల్ ప్రాజెక్ట్‌తో మళ్ళీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఫిబ్రవరి 16న ఈ చిత్ర టైటిల్‌తో ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన మేకర్స్ తాజాగా ఫస్ట్ గ్లింప్స్‌ను వదిలారు. ఫస్ట్ గ్లింప్స్‌లో శివకార్తికేయన్ సాంప్రదాయ ధోతీ, విభూతి మరియు రుద్రాక్షలతో కనిపిస్తూనే, చేతిలో కాగడా పట్టుకుని ఊగిపోతున్నట్లు కనిపిస్తున్నాడు. శివకార్తికేయన్ పాత్ర చూస్తుంటే.. ఈ సినిమా తమిళ దేవుడు మురుగన్ (సుబ్రహ్మణ్య స్వామి) అంశతో ముడిపడి ఉన్నట్లు తెలుస్తోంది. 'సేయోన్' అంటే రాజు అని అర్థం. మురుగన్‌ని తమిళంలో 'సేయోన్' అని కూడా పిలుస్తారు. లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత బ్యానర్ 'రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్' పై ఆర్. మహేంద్రన్ తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'అమరన్' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత వీరు కలిసి చేస్తున్న రెండో సినిమా కావడంతో ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన మొదటి చిత్రం 'తాయ్ కిళవి' విడుదలకు ముందే శివకార్తికేయన్ ఆయన ప్రతిభను గుర్తించి ఈ భారీ అవకాశం ఇచ్చినట్లు సమాచారం.

# గ్లోబల్ ట్రెండ్ ను ఫాలో అవుతున్న కృతి సనన్


పరిస్థితులకు అనుగుణంగా మారకపోతే అభివృద్ధి సాధ్యం కాదని, సానుకూల దృక్పథంతో ముందుకు సాగితేనే వృద్ధి ఉంటుందని కృతి సనన్ విశ్వసిస్తున్నారు. ఈ ఆలోచనతోనే ఆమె ఇప్పుడు అంతర్జాతీయ వేదికలపై తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగంగా కృతి సనన్ అతి త్వరలో లండన్ ఫ్యాషన్ వీక్‌కు హాజరుకానున్నారు. గ్లోబల్ ఫ్యాషన్ ట్రెండ్స్‌ను నిరంతరం అనుసరిస్తూ, తనకంటూ ప్రత్యేకమైన స్టైల్ స్టేట్‌మెంట్‌ను రూపొందించుకున్న కృతి, ఈసారి లండన్ ఫ్యాషన్ వీక్‌లో ఎలా కనిపించబోతున్నారనేది ఫ్యాషన్ ప్రియులలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో తనను తాను నిరూపించుకోవడానికి ఇదొక గొప్ప అవకాశంగా ఆమె భావిస్తున్నారు. లండన్ ఫ్యాషన్ వీక్‌లో ఆమె అప్పియరెన్స్ తనకు మరింత అంతర్జాతీయ అవకాశాలను తెచ్చిపెడుతుందని కృతి నమ్మకం వ్యక్తం చేశారు.





# సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తున్నా

### హే బలవంత్ హీరోయిన్ శివాని నగరం



'ఇది సుహాస్‌తో నా రెండో సినిమా. కెరీర్‌లో నా మూడో సినిమా. ఇంతకు ముందు చేసిన సినిమాలో ఇంటెన్స్ క్యారెక్టర్ చేశాను. ఇందులో లైటర్ వెయిన్‌లో సాగే ఎంటర్‌టైన్‌మెంట్ పాత్ర. ఎంజాయ్‌చేస్తూ ఈ పాత్ర చేశా. వినోదంతోపాటు ఇందులో ఫాదర్ అండ్ సన్ ఎమోషన్ కూడా బావుంటుంది' అని శివాని నగరం అన్నారు. సుహాస్‌కి జోడీగా ఆమె నటించిన చిత్రం 'హే బలవంత్'. 'హే భగవాన్' అనే టైటిల్‌తో రూపొందిన ఈ సినిమాను కొన్ని కారణాల దృష్ట్యా 'హే బలవంత్'గా మార్చారు. గోపీ అచ్చర దర్శకుడు. బి.నరేంద్రరెడ్డి నిర్మాత. బన్నీవాస్, వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ నెల 20న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో శివాని నగరం విలేకరులతో ముచ్చటించింది. 'వినగానే నచ్చిన కథ ఇది. వినోదంతోపాటు కలర్‌ఫుల్ విజువల్స్, మంచి మ్యూజిక్ కూడా ఇందులో ఉంది. నా పాత్ర, సుహాస్ పాత్ర, నరేష్, వెన్నెల కిశోర్ ఇలా అన్ని పాత్రలూ మిమ్మల్ని నవ్విస్తాయి. సుహాస్ మంచి నటుడు, ఫ్రెండ్లీ కూడా. ఇందులో మా కాంబినేషన్ సీన్స్‌ని ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. తెలుగు మాత్రమే కాక, ఇతర భాషల నుంచి కూడా అవకాశాలు వస్తున్నాయని, సెలెక్టీవ్‌గా సినిమాలు చేస్తున్నాననీ, తమిళంలో రెండు సినిమాలు నిర్మాణ దశలో ఉన్నాయని, తెలుగులో రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయని శివాని నగరం తెలిపారు.



# స్టార్‌గా ఎదగడం మామూలు విషయం కాదు

### నటి మృణాళ్ ఠాకూర్

సినిమా ఇండ్రస్టీలో బ్యాక్‌గ్రౌండ్ లేకుండా వచ్చి స్టార్‌గా ఎదగడం అంటే చిన్న విషయం కాదు. అందులోను ముఖ్యంగా హీరోయిన్ లకు.. ఎంత అందంగా ఉన్నప్పటికి స్టార్ డమ్ సంపాదించుకోవాలి అంటే తిప్పలు పడాల్సిందే. కొంత మందికి అదృష్టం బాగుండి అవకాశాలు వస్తాయి అందులో మృణాల్ ఠాకూర్ ఒకరు. తన అందం, అభినయంతో సౌత్ నార్త్ ప్రేక్షకులను మాయ చేస్తున్న ఈ ముద్దుగుమ్మ, ప్రస్తుతం ఆమె నటించిన లేటెస్ట్ మూవీ 'దో దీవానే షెహర్ మే' విడుదల సిద్ధంగా ఉంది. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా మృణాల్ తన కెరీర్ తొలినాళ్లలో పడ్డ కష్టాలను పంచుకుంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంచి పాత్రల కోసం దర్శకుల వెంట పడటంలో ఏమాత్రం తప్పు లేదని మృణాల్ స్పష్టం చేశారు.. 'మనం ఒక పాత్ర కోసం ఎంత ఆకలితో ఉన్నామో తెలిస్తేనే దర్శకుల ఆలోచనా విధానం మారుతుంది' అని ఆమె అభిప్రాయపడ్డారు. తన తాజా చిత్రం 'దో దీవానే షెహర్ మే' అవకాశం కూడా అలానే వచ్చిందని ఆమె వెల్లడించారు. దర్శకుడు రవి ఉద్యావర్ తెరకెక్కించిన 'మామ్' సినిమా చూసి ఫిదా అయిపోయిన మృణాల్, నేరుగా ఆయన్ని కలిసి.. 'సర్, మనం సినిమా ఎప్పుడు చేస్తున్నాం?' అని అడిగేశారట. ఆమెలోని ఆ ధైర్యమే నేడు ఈ భారీ ప్రాజెక్టులో అవకాశం తెచ్చిపెట్టింది. గతాన్ని గుర్తుచేసుకుంటూ.. 'మొదట్లో నాకు పని ఎలా అడగాలో కూడా తెలియదు. 'ధురంధర్' డైరెక్టర్ ఆదిత్య ధర్ గారినే నేను మొదటిసారి అవకాశం అడిగాను. ఒక అవుట్‌సైడర్‌గా నా ముఖం వాళ్లకు కనిపించేలా చేసుకోవడానికి 'సర్, నేను ఇక్కడే ఉన్నాను.. నన్ను ఒకసారి కాస్ట్ చేయండి' అని బతిమిలాడేదాన్ని' అంటూ మృణాల్ ఎమోషనల్ అయ్యారు. సిద్దాంత్ చతుర్వేదితో కలిసి ఆమె నటించిన ఈ రొమాంటిక్ డ్రామా ఫిబ్రవరి 20న థియేటర్లలోకి రానుంది. అరేంజ్డ్ మ్యారేజ్ నేపథ్యంలో సాగే ఈ కథ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని మృణాల్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# దురంధర్-2 మూవీకి ఆటకం

ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోన్న 'ధురంధర్ 2' చిక్కుల్లో పడింది. ఈ సినిమా నిర్మాణ సంస్థ ముంబయిలో షూటింగ్ చేసుకోవడానికి వీల్లేదని దీనిపై బ్యాన్ విధించాలని బృహన్ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ బ్యాన్ ప్రభావం షూటింగ్‌పై పడనుంది. ముంబయిలో చిత్రీకరణకు అనుమతి ఇవ్వాలని నిర్మాణ సంస్థ అప్లై చేసుకోగా.. దానికి మున్సిపల్ కార్పొరేషన్ అనుమతులు ఇవ్వలేదు. అంతేకాకుండా దీనిపై శాశ్వతంగా బ్యాన్ విధించాలని ప్రభుత్వాన్ని కోరింది. గతంలో షూటింగ్ నిర్వహించిన సమయంలో టీమ్ నిబంధనలను ఉల్లంఘించిందని అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కార్పొరేషన్ వెల్లడించింది. ముంబయిలోని పలు వీధుల్లో ఇటీవల దీని షూటింగ్ జరిగిందని ఆ సమయంలో క్రాకర్లు, మండే పదార్థాలు ఉపయోగించారని అది షరతులను ఉల్లంఘించినట్లేనని అధికారులు పేర్కొన్నారు. ఆదిత్యధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన చిత్రం 'ధురంధర్'. గతేడాది చివర్లో విడుదలై సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంది. దీనికి సీక్వెల్‌గా 'ధురంధర్:ది రివెంజ్' రానుంది. మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

